ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

గురువారం 13 నవంబరు 2025

హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను త్వరలో పూర్తిచేసి ప్రతి చెరువుకు నీరు ఇవ్వడం ద్వారా రాయలసీమ ప్రాంతాన్ని రతనాలసీమగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరు పారిస్తామని, వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్ల ద్వారా రాయచోటికి సాగు, తాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తానని అన్నారు. బుధవారం ఆయన రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో పేదల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రజావేదికలో, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



హేమలత గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రతనాలసీమ చేస్తాం

- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు సాగునీరు
- హంద్రీ-నీవా ద్వారా ప్రతి చెరువుకు నీరు
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని, హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రాయలసీమను రతనాలసీమగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మాణం పూర్తి చేసుకున్న 3 లక్షల పక్కా గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పీఎంఏజేవై పథకం కింద మంజూరైన నిర్మాణాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.50 వేలు, రూ.70 వేలు చొప్పున అదనపు నిధులను అందించి నేడు సగర్వంగా పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించామని తెలిపారు.



సభకు హాజరైన మహిళలు

నదుల అనుసంధానం

నదులను అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, త్వరలోనే పెన్నా నదితో పాటు ఇతర నదులను కూడా అనుసంధానం చేసి రాయలసీమ ప్రాంతంలోని బీడు భూములను సైతం సాగులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వడమే కాకుండా ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి సాగునీరు అందించడం ద్వారా రైతులను మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు.

ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త..

గత ప్రభుత్వంలో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని, గుంతల మయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500 కోట్లతో రాష్ట్రంలోని రోడ్లన్నీ అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే కూటమి ప్రభుత్వం ముందున్న లక్ష్యమన్నారు. అందుకోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే ఉపాధి, ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.



మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రతి పేదవాడికీ గూడు..

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి కూడు, గూడు కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా బీసీ, నా ఎస్టీ, నా మైనార్టీ, నా ఎస్సీ అంటూ ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంకు సాదర వీడ్కోలు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టీడీపీ నేతలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలో పేదల గృహప్రవేశ కార్యక్రమం, ప్రజావేదిక కార్యక్రమాల్లో బుధవారం సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం కడప విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో విశాఖపట్టణం వెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి విమానాశ్రయంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, టీడీపీ నేతలు లింగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, భూపేశ్‌రెడ్డి, శ్రావణ్‌రాజ్‌రెడ్డి, జనసేన నేత సుంకర శ్రీనివాస్ తదితరులు వీడ్కోలు పలికారు.

ఎగ్జిబిషన్ బకాయిలపై విచారణ

ప్రొద్దుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్ బకాయిల వసూళ్లపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ వైసీపీ చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో మున్సిపల్ ఆర్డీ నాగరాజు విచారణ చేపట్టారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీ ఎగ్జిబిషన్ లీజు బకాయిలు ఎవరెవరు ఎంత ఉన్నారు, ప్రస్తుతం ఎంత వసూళ్లు చేశారు అనే విషయాలను ఆయన మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, ఆర్ఐ రమేశ్‌లను విచారించారు. ఫైల్స్ ను తనిఖీ చేశారు. ఈ ఎగ్జిబిషన్ బకాయిలపై రిపోర్టును తయారు చేసి డీఎంఏకు పంపుతామని తెలిపారు. అలాగే ఐదు మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు అస్తవ్యస్తంగా జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులను పరిశీలించామన్నారు. ఇంకా కొన్ని ఫిర్యాదులపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదికను డీఎంఏకు పంపుతామని ఆర్డీ తెలిపారు. కాగా ఆర్డీ నాగరాజును మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి, వైస్ ఛైర్మన్ బంగారు మునిరెడ్డి కలిసి ఎగ్జిబిషన్ లీజు బకాయిలపై చర్యలు తీసుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.



కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్డీ నాగరాజు

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు చర్యలు

ప్రొద్దుటూరు / కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర పాలకసంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో ఎంఎస్ నెంబరు 225 విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం అనుమతి లేకుండా కట్టిన భవనాలు, ప్లాన్‌కు విరుద్ధంగా కట్టిన భవనాలను ఒకేసారి రెగ్యులర్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 1జనవరి 1985 నుంచి 31 ఆగస్టు 2025 మధ్యలో కట్టిన బిల్డింగ్‌లకు ఫీజులు చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చు. 31 ఆగస్టు 2025 తరువాత కట్టిన అక్రమ బిల్డింగ్‌లను రెగ్యులర్ చేయరు. బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో రిజిష్టర్ సేల్ డీడీ డాక్యుమెంట్ లింక్ డాక్యుమెంట్, ఈసీ, మార్కెట్ వాల్యూ, ఇంటి ప్లాన్, బిల్డింగ్ ఫొటో ప్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికేట్, ఇన్‌డెమినిటి బాండ్‌లను అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలి. ప్లాట్ సైజు డవియేషన్ ల్యాండ్ విలువ ఆధారంగా చార్జీలు వసూలు చేస్తారు. ప్రతి దరఖాస్తు దారుడు రూ.10వేలు ముందస్తు చెల్లింపు తప్పనిసరి. పాత బిల్డింగ్‌లకు 31డిసెంబరు 1997 కంటే ముందు ఉన్నవాటిపై 25 శాతం తగ్గింపు, స్లమ్ ఏరియాలో ఉన్నవాటికి 50- శాతం తగ్గింపు ఉంటుంది. ఈ నోటిఫికేషన్ వచ్చిన 120 రోజుల లోపు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని ఏపీఓ కృష్ణసింగ్ తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా షేక్ గౌసున్నీసాబేగం

7

అన్నిగ్రామాలకు ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలు

వైసీపీ తీరుతో జనం బేజారు

బద్వేలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల తీరు ప్రజలకు బేజారెత్తించింది. బద్వేలు పట్టణంలో సుమారు అర్ధగంట పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైసీపీ చేపట్టిన నిరసన సందర్భంగా పట్టణంలోని పోరుమామిళ్ల రహదారి బ్లాక్ అయింది. దీంతో సుమారు అర్ధగంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులే కాదు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో యువత, విద్యార్థులు ఎవరూ కనిపించలేదు. కేవలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి పోరుమామిళ్ల రహదారి వెంట భారీ స్థాయిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం పట్ల ప్రజలు అసహనానికి గురయ్యారు.



వైసీపీ నిరసన సందర్భంగా ట్రాఫిక్ స్తంభించడంతో ఇక్కట్లు పడుతున్న వాహనదారులు

మంది ఎక్కువ.. పని తక్కువ

- సచివాలయ సిబ్బందితోనే ఇంటివద్దకు సేవలు
- జనాభాను బట్టి సిబ్బంది రీగ్రూపింగ్
- పర్యవేక్షణ మెరుగు చేస్తే.. పాలనకు ఊపు

(కడప-ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం కొత్తరూపు తీసుకు వచ్చింది. సచివాలయ సిబ్బందే ఇంటి వద్దకు వస్తూ అన్ని వివరాలు కనుక్కోవడంతో పాటు పథకాలు తెలపడంతో ప్రజలు సంతోష పడుతున్నారు. ఇంకా కొంతమేర మెరుగు పరచేందుకు సచివాలయ వ్యవస్థ పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా, డివిజను, మండల స్థాయిలో నూతనంగా అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హులకు పదోన్నతులు కల్పించి సచివాలయ పర్యవేక్షణకు డిప్యూటీ ఎంపీడీవోలను నియమించనున్నారు. గతంలో ఏ శాఖకు సంబంధించి ఆ శాఖ అధికారులకే సచివాలయ కార్యదర్శులు బాధ్యత వహించేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించిన బాధ్యతలు తమ శాఖవి కాకపోయినా చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అందరూ సమష్టిగా పనిచేసే అవకాశం పెరిగింది.



జమ్మలమడుగు మున్సిపాలిటీలోని నాగులకట్టవీధిలోని వార్డు సచివాలయంలో 8 మంది సిబ్బందికి గాను సోమవారం ఉదయం 11.20గంటలకు ముగ్గురు మాత్రమే డ్యూటీలో ఉన్నారు.



ప్రొద్దుటూరులోని 13వ సచివాలయంలో 10 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ప్లానింగ్, వెల్ఫేర్, అమినిటీస్ కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. ఇక్కడ మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో వీరిపైనే భారం పడుతోంది.

గతంలో 11మంది..

జగన్ ప్రభుత్వంలో ప్రతి సచివాలయానికి 11 మంది సిబ్బందిని నియమించారు. దీంతో వీరు రోజులో కేవలం గంట పనితోనే కాలం గడుపుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఆ ఉద్యోగులను రీగ్రూపింగ్‌తో 2500 మంది జనాభా ఉంటే ఆరుగురు, 2500 నుంచి 3500పైన ఉంటే ఏడుగురు, ఆపైన ఉంటే 8 మంది సిబ్బందిని నియమించారు. దీంతో మిగులు సిబ్బందిని ఇతర అవసరాలకు వాడుకునే వెసులుబాటు కలిగింది. ప్రస్తుతానికైతే సచివాలయ ఉద్యోగులు రోజువారీ పనిలేక ఖాళీగానే ఉంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

విధులు ఇలా

ప్రస్తుతం రూరల్‌లో పంచాయతీ కార్యదర్శులు, అర్బన్‌లో అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు సచివాలయ బాధ్యతలు చూస్తున్నారు. వీరు మిగతా సిబ్బంది విధులను పర్యవేక్షించడంతో పాటు తమ విధులు కూడా చేస్తున్నారు.

- పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కొత్తగా స్వామిత్వ, స్వర్ణపంచాయతీ కార్యక్రమాలు, ఈకేవైసీ, కౌశలం వంటి వాటి సర్వేలను పర్యవేక్షిస్తున్నారు. వీరికి పనిభారం అధికంగానే ఉంది.
- డిజిటల్ అసిస్టెంట్లు సర్వీసులు అందించడంలోనూ కొన్ని చోట్ల ఆధార్ సెంటర్ల నిర్వహణ, వీటితో పాటు సర్వేలు వంటి పనులు చేస్తున్నారు. చిన్న గ్రామాల్లో కొంత మేర తక్కువగా ఉన్నా 3500 ఆపై జనాభా ఉన్న ప్రాంతాల్లో వీరికి కూడా పనిభారం అధికంగా ఉంటుంది.
- సంక్షేమ కార్యదర్శులు ప్రభుత్వ పథకాల అర్హుల ఎంపిక, వారికి సంబంధించి దరఖాస్తుల సేకరణ, ఈకేవైసీ తదితర పనుల్లో తలమునకలై ఉన్నారు.
- అగ్రికల్చర్ అసిస్టెంట్లు చాలా చోట్ల క్లస్టరు చేయడంతో కొద్దిమేర పనిభారంతోనే ఉన్నారు.
- మహిళా పోలీసులు... ప్రస్తుతం వీరికి సర్వేలు తప్ప ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదు.
- ఏఎన్ఎంలు ఉన్నా కొంత మేర వారికి కూడా పనిభారం తక్కువే.
- వెటర్నరీ అసిస్టెంట్లు గతంలోనే తక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరు పశువైద్యశాలలకు మాత్రమే పరిమితమయ్యారు.
- జేఎల్ఎంలు కూడా విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల్లో మాత్రమే ఉన్నారు. సచివాలయాల్లో వారు కనిపించేది తక్కువే.

ఇబ్బందులు తీరితే..

సచివాలయాల నిర్వహణకు పంచాయతీ నుంచి నిధులను వినియోగించుకోవాలని గత ప్రభుత్వం పేర్కొంది. కానీ నిధుల విడుదలలో జాప్యం కావడం.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి సర్పంచ్‌లు పెట్టిన ఖర్చులే రాకపోవడంతో వారు సచివాలయాలను పట్టించుకోలేదు. దీంతో పేపర్లు, కంప్యూటరు రిపేర్లకు కూడా కార్యదర్శులు అడుక్కోవాల్సిన దుస్థితి. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉంది. కొంత మేర నిధులను పంచాయతీ నుంచి కాకుండా ప్రభుత్వమే సచివాలయాలకు విడుదల చేస్తే ఇబ్బందులు తీరుతాయని మరింత బాగా పనిచేసేందుకు వీలుంటుందని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు.

ప్రైవేట్‌పరం చేయడం ఆపాలి : ఎంపీ



పులివెందులలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పులివెందుల / కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే విధానాన్ని వెంటనే ఆపాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రజా ఉద్యమం పేరుతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తెచ్చారన్నారు. ఇవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మెడికల్ కళాశాల పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయన్నారు. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన కడపలో వైసీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి, మాజీ మేయర్ సురేశ్‌బాబు , ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం తదిత రులు పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి.. @ మదనపల్లె టు బెంగళూరు

- కార్పొరేట్ ఆసుపత్రుల కేంద్రంగా మార్పు
- కిడ్నీ ఆపరేషన్‌కు రూ.60 లక్షలు వసూళ్లు

మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జరిగిన కిడ్నీ ఆపరేషన్ వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. కిడ్నీ డోనర్ నుంచి రిసీవర్ వరకూ కొందరు దళారులు ముఠాగా ఏర్పడి దందా సాగిస్తున్నారు. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్, సిబ్బంది ద్వారా కొన్ని ఆసుపత్రులు, మరికొందరు వైద్యులు సంయుక్తంగా ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇలా మదనపల్లె నుంచి బెంగళూరుకు కిడ్నీలను తరలించి అక్కడి ఆసుపత్రులలో రోగులకు అమరుస్తున్నారు. ఇందుకు మదనపల్లెలో తాజాగా జరిగిన ఘటనే ఉదాహరణ.

విశాఖపట్నంకు చెందిన ఎస్.యమున(29)ని, గాజువాక ఏరియాకు చెందిన పద్మ, సత్యలు కిడ్నీ విక్రయానికి డబ్బులు ఎరగా చూపారు. ఇందులో భాగంగా మదనపల్లె, కదిరి ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాల్లో పనిచేస్తున్న బాలరంగడు, మెహరాజ్‌లను ఆశ్రయించి యమునను మదనపల్లెకు తీసుకొచ్చారు. అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు నిర్వహిస్తున్న గ్లోబల్ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఇక్కడ డాక్టర్ ఆంజనేయులు కుమారుడు డాక్టర్ అవినాష్ ఆర్థోపెడిక్, కోడలు శాశ్వతి కంటివైద్య నిపుణురాలుగా పనిచేస్తున్నారు. అలాగే కోడలు శాశ్వతి, స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇదే విభాగాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్ల ద్వారా కిడ్నీ డోనర్స్‌ను తీసుకొచ్చి ఆపరేషన్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం బెంగళూరులోని స్పెషలిస్టులను రప్పించి కిడ్నీ మార్పిడి, రవాణా వ్యవహారం నడుపుతున్నారు. ఇక్కడ జరిగింది కూడా ఇదే. వైజాగ్ ప్రాంతానికి సంబంధించిన మధ్యవర్తులు, యమునాను తీసుకొచ్చి కిడ్నీని తొలగించారు. అలాగే బెంగళూరులోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు..కిడ్నీ రిసీవర్స్‌తో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పనికానిస్తున్నారు. అయితే డోనర్ యమున మృతితో ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారం బయటపడింది.



స్టేషన్ ముందు బంధువులతో కలసి మాట్లాడుతున్న యమున తల్లి సూరమ్మ



గ్లోబల్ ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దేవశిరోమణి, రమేష్‌బాబు

స్పెషలిస్టును పిలిపించినా..

డోనర్ నుంచి కిడ్నీని తొలగించి రిసీవర్స్‌కు అమర్చడం చాలా కష్టంతో కూడిన పనిగా చెబుతున్నారు. అయితే అందుకు ఆపరేషన్ థియేటర్, సంబంధించిన పరికరాలన్నీ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. వాటితో పాటు అనుభవజ్ఞుడైన స్పెషలిస్టు కూడా ఉండాలి. కానీ మదనపల్లెలో గ్లోబల్ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ మినహా ఆ స్థాయిలో పరికరాలు, సౌకర్యాలు లేవని చెబుతున్నారు. ముఖ్యంగా కిడ్నీని ఆయా ఇన్‌జక్షన్లతో భద్రపరిచి తరలించే ప్రత్యేక పరికరం కూడా ఉండాలని చెబుతున్నారు. మరోవైపు ఇందుకోసం యూరాలజీ లేదా నెఫ్రాలజీ వైద్యుడు అనస్థీషియాతో పాటు రిసీవర్‌కు అమర్చే స్పెషలిస్టు ఉండాలి. అయితే మదనపల్లెలో మూడునాలుగు ఆసుపత్రులలో తప్పా, ఆపరేషన్ థియేటర్ లేవని చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే, డాక్టర్ ఆంజనేయులు అనస్థీయా స్పెషలిస్టు, కోడలు శాశ్వతి కూడా డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి కావడంతో కిడ్నీ మార్పిడికి అవకాశం ఏర్పడినట్లు చెబుతున్నారు. ఇక్కడ కిడ్నీని ఆపరేషన్‌తో తొలగించే అవకాశమే ఉందని, అందుకే బెంగళూరు నుంచి రప్పించిన స్పెషలిస్టుతో తీసేసి, ఆయన పర్యవేక్షణలో బెంగళూరు లేదా ఇతర ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. అయితే డోనర్‌గా ఉన్న యమున కిడ్నీని గోవాకు చెందిన రిసీవర్ ధీరజ్‌సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ కిడ్నీ మార్పిడి వ్యవహారంలో మధ్యవర్తులు డోనర్స్‌ను తీసుకొచ్చే బెంగళూరు, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి అక్కడ అందుబాటులో ఉన్న రిసీవర్స్‌కు అమరుస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం రూ.60 లక్షలకు పైగా ఖర్చు అవుతుండగా, డోనర్, మధ్యవర్తులకు రూ.10లక్షలు నుంచి రూ.15లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. అయితే మదనపల్లె కేంద్రంగా ఇప్పటి వరకూ ఇలా కిడ్నీ రాకెట్ వ్యాపారం జరగలేదని, గ్లోబల్ ఆసుపత్రిలో ఎన్ని రోజులుగా జరుగుతోందోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రుల నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు చేస్తూ, ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కొందరు ఇలాంటి ప్రత్యేకమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా కిడ్నీ రిసీవర్స్ అంతా డయాలసిస్ రోగులే. అలాంటి వారు చాలా మందే ఉన్నా.. దాన్ని అమర్చుకోవడం సాధారణ, మధ్య తరగతి వర్గాలు ఆ స్థాయిలో డబ్బులు ఖర్చు చేసే అవకాశం లేదు. ప్రస్తుతం ఇలాంటి వారంతా పెద్దపెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆర్థిక స్థోమత ఉన్నవారే. వారంతా కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ, కిడ్నీలు అమర్చుకుంటుండగా, వీటిని పేద, ఆర్థిక ఇబ్బందులోని బాధితులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో రిసీవర్స్ తరపున వైద్యులు, డోనర్స్ తరపున ఏజెంట్లు, మధ్యవర్తులుగా డయాలసిస్ కేంద్రాల్లోని టెక్నీషియన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం సమాజం సరోగసి తరహాలోనే కిడ్నీ వ్యాపారం విస్తరించి ముఠాగా మారినట్లు ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

డోనర్ మృతితో వెలుగులోకి..

- డయాలసిస్ కేంద్రం తనిఖీ
- కిడ్నీ రాకెట్.. గ్లోబల్ ఆసుపత్రి సీజ్
- నిద్రమత్తులో వైద్యశాఖ అధికారులు
- రెండూ తీసేశారా ? బాధితుల అనుమానం

మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో కిడ్నీ ఆపరేషన్, ఆపై డోనార్ యమున మృతి నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మదనపల్లె పేరు మరోసారి మార్మోగింది. గ్లోబల్ ఆసుపత్రిలో మంగళవారం నాటి సంఘటనతో ఉలిక్కపడ్డ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం, సంఘటన జరిగిన గ్లోబల్ ఆస్పత్రిని డీఎంఅండ్‌హెచ్‌ఓ దేవశిరోమణి, అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ రమేష్‌బాబు తనిఖీ చేశారు. అందులోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నిందితునిగా ఉన్న టెక్నీషియన్ బాలరంగని వ్యవహారశైలిపై ఆరా తీశారు. ఈయన ఎన్నిరోజులుగా పనిచేస్తున్నాడు.. రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు. వారంతా ఎక్కడెక్కడి వారు.. మొదట్లో వస్తున్న వారంతా ఇప్పుడూ కేంద్రానికి వస్తున్నారా? లేదా అనే కోణంలోనూ ఆరా తీసిన అధికారులు, అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆసుపత్రికి చేరుకుని రికార్డులు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రి అనుమతికి సంబంధించిన రికార్డులు లేకపోవడంతో ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇది మొదటిసారేనా..?

మరోవైపు ఇక్కడి ఆసుపత్రిలో ఎన్ని రోజులుగా ఎన్ని ఆపరేషన్లు చేశారు? అందులోని పేషంట్లు, వారికి సంబంధించిన వివరాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కిడ్నీ ఆపరేషన్‌కు సంబంధించిన అంశాలు ఏమైనా ఉన్నాయా ? అనే కోణంలోనూ డీఎంఅండ్ హెచ్‌వో, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వోలు ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. తాము ఆసుపత్రిని నిర్వహించ లేదని, కొందరు అద్దెకు అడిగితే ఆపరేషన్ థియేటర్ ఇచ్చామని, ఈ సందర్భంగా అక్కడికి వెళ్లిన అధికారులకు డాక్టర్ ఆంజనేయులు కుమారుడు చెప్పినట్లు తెలిసింది. అయితే, ఆయన తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగి, అందులోనూ జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త హోదాలో ఉంటూ ఇలా జరగడం ఏంటని ప్రశ్నించినట్లు చెబుతున్నారు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో కొన్నింటికి అనుమతులు లేకపోగా, మరికొన్నింటికి ఉన్నా ఇలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నా.. జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు.. సంఘటన జరిగాక, హడావిడి తనిఖీలు చేయడం, రికార్డులు ఎత్తుకెళ్లడం, ఆసుపత్రులను సీజ్ చేయడం మినహా.. సాధారణంగా ఆ పనులు చేయడం లేదు. ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులే నిద్దరో తుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడం మినహా అడ్డుకట్ట పడదనే వాదన విని పిస్తోంది.

డోనర్ మృతితో వెలుగులోకి..

విశాఖపట్నంకు చెందిన కిడ్నీ డోనార్ యమున మృతితో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అంతా సవ్యంగా జరిగి ఉంటే ఎవరిదారిన వారు వెళ్లిపోయేవారు. అయితే విధి రాతను ఎవరూ తప్పించుకోలేరన్న వాదన నిజమైం దని స్థానికులు నిట్టూరుస్తున్నారు. ఆపరేషన్ అనంతరం మృతిచెందడం, తర్వాత ఈ విషయాన్ని కుటుంబీకులకు సరైన పద్ధతిలో చెప్పడంలో మధ్యవర్తులు పద్మ, సత్యలు విఫలమైనట్లు చెబుతున్నారు. అలాగే మృత దేహాన్ని యమునతో కలిసి ఉంటున్న సూరిబాబుకు చూపించలేదని తెలిసింది. దీంతో మృతురాలికి రెండు కిడ్నీలూ తీసేశారేమోనన్న అనుమానం కలిగినట్లు తెలుస్తోంది. దీంతోనే వివాదం పెద్దదై, చివరకు పోలీసులు, కేసుల వరకూ వెళ్లినట్లు చర్చ నడుస్తోంది.

మొదట సూరిబాబును సర్దుబాటు చేసి తర్వాత మృతదేహాన్ని విశాఖ తరలించి ఉంటే అక్కడ అంతా సవ్యంగా జరిగేదేమోనని భావిస్తున్నారు. యమున కిడ్నీని గోవాకు చెందిన ధీరజ్‌నాయక్‌కు అమర్చడానికి ఒప్పందం కుదుర్చుకోగా, ఇందులో బెంగళూరుకు చెందిన స్పెషలిస్టు ఆపరేషన్ చేసినట్లు స్థానికంగా ప్రచారంలో ఉంది. ఒకే బ్లాడ్ గ్రూపు గల వ్యక్తికి సంబంధించిన కిడ్నీనే కావాల్సి వుంటుంది. అది కూడా చట్టపరంగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడం, లేదా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత క్రమంలో కావాల్సిన శరీర అవయవాలను సమకూర్చే అవకాశం ఉంది. అది కూడా బతికున్న వారివి కాకుండా, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మృత్యువుకు దగ్గరలో ఉంటూ, అది కూడా బాధితులే స్వచ్ఛందంగా ఇచ్చే వాటిని స్వీకరించాల్సి వుంటుంది.

కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

మదనపల్లెటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ అధికారి ఎ.రాధమ్మ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ప్రజలకు చెల్లించే ఇంటిపన్నులు, పన్నేతర వసూళ్లు, ఫీజులు అన్నీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి స్వర్ణాంధ్ర పోర్టల్ ద్వారా డిజిటల్ పేమెంటు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ విషయమై పలుమార్లు టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చారు. కానీ కోళ్లబైలు పంచాయతీ కార్యదర్శి మంజుల పంచాయతీ పన్నుల వసూళ్లలో చేతివాటం ప్రదర్శించి, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మాన్యువల్ రసీదులు ఇచ్చి పన్ను వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై మదనపల్లె డిప్యూటీ ఎంపీడీఓ భారతి విచారించి నివేదికలను డీపీఓకు పంపారు. డీపీఓ నివేదికలను పరిశీలించిన పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంజులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వృద్ధుడు అదృశ్యం - కేసు నమోదు



రెడ్డిశేఖర్‌రెడ్డి (ఫైల్‌పాటో)

మదనపల్లెఅర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, ప్రశాంత్‌నగర్‌కు చెందిన మాజీ సైనికుడు రెడ్డిశేఖర్‌రెడ్డి (60) ఈ నెల 11వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదు. కాగా అతను మదనపల్లె మండలం, ఎస్టేట్ వద్ద తమకు ఉన్న సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద నుంచి తమ బంధువులకు ఫోన్ చేసి నేను చనిపోతున్నానని మేసేజ్ పెట్టి అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసుస్టేషన్‌లో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామన్నారు. సమాచారం తెలిస్తే ఎస్ఐ 9440796743, సీఐ 94407 98742కు తెలపాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరులో అక్టోబరు 30న జరిగిన రాష్ట్రస్థాయి సైకిల్ పోలో ఎంపికల్లో ఆడపూరులోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతి భను చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు. తమ కళాశాలలో జూనియర్ బైపీసీ చదువుతున్న అనూష, ప్రవళిక, జూనియర్ ఎంపీసీ విద్యార్థిని దివ్య ఎంపికయ్యారని తెలిపారు. వీరు నవంబరు 15 నుంచి 18 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే ఫెడరేషన్ కప్‌లో పాల్గొంటారని తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైకిల్ పోలో జిల్లా ప్రెసిడెంట్ యర్రన్న తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కలకడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి పోతువారిపల్లి క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలేటి (65) మృతి చెందినట్లు ఎస్ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కేవీపల్లి మండలం తీతావగుంటపల్లి కురవపల్లి వాసి పాలేటి కలకడ సంతకు వచ్చి ద్విచక్ర వాహనంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న మినీట్రక్కు ఢీకొంది. ఘటనలో బాధితుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీరు అలిగితే ఓడిపోతాం..

బాగుంటే గెలుపు మనదే

- కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

చిన్నమండెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీపై అలిగి ఇంట్లో ఉన్న ప్రతిసారి ఓడిపోయాం మీరు అలగకుండా పనిచేస్తే గెలుపు మనదే... భవిష్యత్తులో ఎప్పుడూ ఓడిపోము. పార్టీ అధికారంలో ఉంటేనే కార్యకర్తలకు గౌరవం, టీడీపీ గెలిచిన ప్రతిసారి రాష్ట్ర ప్రగతి పరుగులు పెడితే ఓడిపోయిన ప్రతిసారి పాతాళంలోకి పడిపోతుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రంలోని సొంత ఇళ్ల లేని పేదలకు ఇళ్ల ఇస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ హామీ అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లి గ్రామంలో సీఎం లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి కూటమి ప్రభుత్వం ప్రభంజనం వీచినా రాయచోటిలో 1.25 శాతం ఓట్ల తేడాతోనే గెలిచాం. ఈ సారి ఈ గెలుపు మరింత ఎక్కువ ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత మీదేనని తెలిపారు. కార్యకర్తలను నా కుటుంబ సభ్యులుగా భావిస్తాను. నా కుటుంబ సభ్యులు తప్పు చేసినా ఒప్పుకోను. అలాగే మీరు చేసే ప్రతి మంచి చెడులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నా. గత ప్రభుత్వం కార్యకర్తల మీద పెట్టిన కేసులు, ఆస్తులు లాక్కోవడం వంటి వాటి నుంచి మిమ్మలను కాపాడేందుకు లీగల్ టీంను ఏర్పాటు చేసి మిమ్మలను కాపాడుకున్నాను. పార్టీలో ఏ పదవి రావాలన్నా మీ అభిప్రాయం తీసుకుని మీరు ఆమోదిస్తేనే పదవులు ప్రకటిస్తున్నా. గత ఎన్నికల సమయంలో గెలవలేరు అనుకున్న స్థానాల్లో అభ్యర్థులను మొహమాటం లేకుండా మార్చడంతోనే కూటమితో 164 స్థానాలు గెలచుకోగలిగాం. రాయలసీమను అభివృద్ధి చేసేది మనమే.. రాయలసీమలో ఎక్కువ స్థానాలు వచ్చేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్‌గా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, నాతో సహా ఎవ్వరూ తప్పు చేసినా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, ప్రతినిత్యం ప్రజల్లో ఉంటేనే రాజకీయాల్లో రాణించగలమని తెలిపారు. పాలిటిక్స్‌ను పాలిటిక్స్‌గానే చూడాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 459 మంది ముఖ్య నాయకులు ఉన్నారు. వారితో పాటు ఉన్న కార్యకర్తలు సైతం ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా టీడీపీ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఏ కార్యకర్త ఆపదలో ఆదుకుంటోందని తెలిపారు. ప్రతి కార్యకర్త ఏ విధంగా పనిచేస్తున్నారో భవిష్యత్తులో వాటిని దృష్టిలో పెట్టుకుని పదవులు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఒక్క రోజు పర్యటనలో భాగంగా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో మన ఇళ్లు- మన గౌరవం, పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమాలను విజయవంతంగా ముగించుకొని చిన్నమండెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి కడప విమానాశ్రయానికి సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ అభిమానులు సీఎంకు సాదర వీడ్కోలు పలికారు.





సీఎంకు అభివాదం చేస్తున్న మహిళా కార్యకర్తలు, బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

మిత్ర మెగా టౌన్‌షిప్‌కు అనుమతి లేదు

- ప్లాట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉస్మాన్‌నగర్ సెగ్మెంట్-2 ఏరియాలో నిబంధనలకు వ్యతిరేకంగా మిత్ర మెగా టౌన్‌షిప్ డెవలపర్స్ వారు 49 ఎకరాల్లో లేఅవుట్ వేశారని, ఇందులో ప్లాట్లు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిత్ర మెగా టౌన్‌షిప్ వారు మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది జనవరి 20న 49 ఎకరాల్లో అక్రమ లేఅవుట్ వేశారన్నారు. సెక్షన్ 184, 185(1), 360, 360(1) కింద నోటీసులు జారీ చేసి ఉన్నామన్నారు. వీరు ఇంతవరకు లేఅవుట్ మంజూరు కొరకు రాజంపేట పురపాలక సంఘానికి అర్జీ పెట్టలేదన్నారు. లేఅవుట్ మంజూరు లేకుండానే ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నట్లు తమకు తెలిసిందన్నారు. ప్రజలు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మంజూరు కాని లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేయరాదని, ఇళ్లు నిర్మించుకోరాదని తెలిపారు. ఈ అక్రమ లేఅవుట్‌లో ఎవరైనా ఇళ్లు నిర్మిస్తే వాటిని పడగొడతామని, ఈ లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకాలు చేయరాదని తెలిపారు. మిత్ర టౌన్‌షిప్ డెవలపర్స్ వారు లేఅవుట్ మంజూరు కొరకు అర్జీ సమర్పించి లేఅవుట్ మంజూరు చేసుకోవాలని, లేదంటే ఈ ప్లాట్లు అమ్మకాలు చెల్లవని తెలిపారు.

యువకుడిపై పలువురు దాడి

- సోషల్‌మీడియాలో హల్‌చల్



యువకుడిపై దాడి చేస్తున్న దృశ్యం

మదనపల్లెఅర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని సుమారు 20 మందికి పైగా మైదానంలోకి తీసుకెళ్లి చొక్కా విప్పి కొట్టిన వీడియో సోషల్ మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. స్థానిక టీకేపల్లె, గంగోత్రి కల్యాణ మండపం సమీప మైదానంలో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో పలువురు కొడుతుండగా మరొకరు విడిపిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు మదనపల్లె పట్టణం, రామారావుకాలనీ, నీరుగట్టువారిపల్లె, వీవర్స్‌కాలనీ యువతగా విశ్వసనీయ సమాచారం. ఈ విష యమై పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని



ఇ.హాసిని

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఇందిరమ్మ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఇ.హాసిని విజేతగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు హాసిని విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, సబిత, హసీనా, కరుణకుమారి, అశోక్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో యువత

- గంజాయికి బానిసలుగా మారి..
- మత్తు ట్యాబ్లెట్లు వాడేస్తున్న వైనం

కడప క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్తుకు యువత చిత్తవుతోంది. కొంతమంది చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి సమయంలో బ్యాచ్‌లుగా తిరుగుతూ మత్తులో జోగుతున్నారు. తెలిసి తెలియని వయసులో మత్తుకు అలవాటు పడుతున్న యువతను కంట్రోల్ చేయలేక తల్లిదండ్రులు సైతం చేతులేత్తేస్తున్నారు. జల్సాల ఉచ్చులో చెడు తిరుగుళ్లు తిరుగుతూ వారికి పరిచయమైన వ్యక్తుల ద్వారా రహస్యంగా గంజాయిని తెప్పించుకొని తాగుతున్నారు. గంజాయి దొరక్కపోతే మత్తు ట్యాబ్లెట్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారస్థులు ఐదు నుంచి పది రూపాయలు విలువ చేసే మత్తు ట్యాబ్లెట్లు వందలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో యువత ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుంది. మైనర్లు సైతం గంజాయి వలలో పడి విలవిల్లాడిపోతున్నారు.





యుక్తవయసులోనే అనారోగ్యం పాలు

కడప నగరంలో గంజాయి బ్యాచ్ ఎక్కువవుతోంది. గంజాయిని ఏజన్సీ ప్రాంతాల నుంచి తెప్పించుకుని వాటిని పొట్లాలుగా మార్చి యువతకు ఒక పొట్లం రూ.90 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మత్తు ఇంజక్ష రూపంలో గంజాయి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలా చాలా మంది గంజాయిని సేవిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. మొదట సిగరెట్లకు తరువాత మద్యం, ఆ తరువాత గంజాయికి బానిసలవుతున్నారు. కళాశాల, పాఠశాలలు లక్ష్యంగా చేసుకుని కొందరు వీటిని విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

నగరశివార్లలో బ్యాచ్‌లుగా...

కడప నగర శివార్లలో (సాయిపేట, అల్మాస్‌పేట, ఖలీల్‌నగర్) తదితర ప్రాంతాల్లో మైనర్లు, యువత బ్యాచ్‌లుగా విడిపోయి గంజాయి వాడుతున్నట్లు సమాచారం. గంజాయిని కొనుగోలు చేసేంత శక్తి లేనివారు మత్తు ట్యాబ్లెట్లు వాడుతున్నారు. అదీ లేదంటే టైర్లకు పంక్చర్లు వేసే సొల్యూషన్, వెట్నర్ లాంటివి కూడా మత్తు కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం. పోలీసులు వీరిపై నిఘా ఉంచి యువతను మత్తు నుంచి వదిలించాలని పలువురు కోరుతున్నారు.

శాస్త్రీయ పద్ధతులతో వన్యప్రాణుల సంరక్షణ : డీఎఫ్‌వో



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతులు ఉపయోగించడం ద్వారా వన్యప్రాణి సంపదలు కాపాడగలమని జిల్లా అటవీ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. అఖిల భారత పులుల లెక్కింపు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కడప నగర వనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రదేశాల్లో పనిచేసే ప్రతి సిబ్బందికి ఇలాంటి శిక్షణలు అవసరమన్నారు. అటవీ సిబ్బందికే కాకుండా వారితో కలిసి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఇలాంటి శిక్షణ ఇవ్వడం మన బాధ్యత అన్నారు. శిక్షణలో భాగంగా పులులను గుర్తించే విధానం, ఇతర వన్యప్రాణులను గుర్తించే పద్ధతులు, అటవీ ప్రదేశాల్లో ఉండాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎంస్ట్రిప్స్ అనే మొబైల్ యాప్ ద్వారా పులుల జాడలను సరిగ్గా నమోదు చేసే విధానం, జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ పద్ధతులు, ఫీల్డ్ సర్వేలో ఉపయోగపడే సాంకేతిక అంశాల గురించి నిపుణులు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు అటవీ అధికారులు, సబ్ డీఎఫ్‌వోలు, అటవీ పరిధి అధికారులు, ఉప అటవీ అధికారులు, అటవీ సిబ్బంది పాల్గొని శిక్షణ పొందారు.

వివాహిత ఆత్మహత్య

మైదుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కడప రోడ్డులో ఉన్న శ్రీరాంనగర్‌కు చెందిన హర్షిత (19) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... తిమ్మిశెట్టి వెంకటరమణ కుమార్తె హర్షితను స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన తరుణ్‌కు ఇచ్చి ఈ ఏడాది జూన్ 6వ తేదీ వివాహం చేశారు. పది రోజుల కిందట తల్లిదండ్రుల వద్దకు వచ్చిన హర్షితను వారు మందలించడంతో మనస్థాపానికి గురై మంగళవారం విషద్రావణం తాగింది. ఆమెను కుటుంబీకులు చికిత్స కోసం కడప రిమ్స్‌కు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. హర్షిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



నాగమల్లయ్య మృతదేహం

ప్రొద్దుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం కొర్రపాడురోడ్డులో నిలబడి వున్న నాగమల్లయ్య (61) అనే వ్యక్తిని మంగళవారం ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయలయ్యాయి. అతన్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఆంధ్రకేసరి రోడ్డుకు చెందిన నాగమల్లయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె వుంది. మంగళవారం భార్య భర్తలిద్దరూ వివేకానంద క్లాత్ మార్కెట్‌లో బట్టలు కొనుగోలు చేసి ఆటోలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై నిలబడ్డారు. అదే సమయంలో కొర్రపాడు రోడ్డు వైపు నుంచి వచ్చిన ఆటో అతి వేగంగా వచ్చి వెనుకవైపు ఢీ కొంది. దీంతో మల్లయ్య రోడ్డుపై కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రతో దాడి... వ్యక్తి మృతి

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు తెలియజేస్తున్న సీఐ వంశీధర్

ఖాజీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముత్తులూరుపాడు హరిజనవాడలో కర్రతో దాడి చేసి వ్యక్తి మృతికి కారణమైన నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలిలా... ఈ నెల 3వ తేదీ నరసింహులు అనే వ్యక్తి మద్యం తాగి మోరీపై నిద్రిస్తుండగా.. ఆదారిలో వెళుతున్న ఎల్లయ్య రోజూ మద్యం తాగుతున్నావంటూ హేళన చేశాడు. దీంతో ఆగ్రహించిన నరసింహులు కర్రతో దాడి చేయడంతో ఎల్లయ్య (35) కుప్పకూలి పడిపోయాడు. అతన్ని వైద్యం కోసం రిమ్స్‌కు, అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో నరసింహులు బుధవారం భూమాయపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

జమ్మలమడుగు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నివశిస్తున్న పర్సా వెంకటేష్ (74) అనే వృద్ధుడు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పది సంవత్సరాల క్రితం మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేష్ పట్టణంలోగ్యాస్ సిలిండర్లు రిపేర్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఆదివారం అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంటిలో ఉరి వేసుకున్నాడు. ఆరోజు నుంచి ఆ ఇంటి వద్దకు ఎవరు వెళ్లలేదు. బుధవారం దుర్వాసన రావడంతో స్థానికులు అక్కడికి వెళ్లి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసు అధికారులు వచ్చి పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గురప్ప తెలిపారు.

హార్సిలీహిల్స్‌లో మంత్రి సత్యకుమార్

బి.కొత్తకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ బుధవారం బి.కొత్త కోట మండల పరిధి పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. సాయంత్రం 6గంటలకు హిల్స్‌కు చేరుకున్న మంత్రికి ఏపీ టూరిజం సిబ్బంది సాదరస్వాగతం పలికారు. మంత్రి గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. పలువురు బీజేపీ నేతలు, మంత్రి అనుయాయులు సత్యకుమార్‌ను కలిశారు. గురువారం మదనపల్లిలో మంత్రి ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి హార్సిలీహిల్స్‌లో బసచేసినట్లు తెలుస్తోంది.

జిల్లాలో అన్ని గ్రామాలకు ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలు

- ముదిరెడ్డిపల్లికి తక్షణం సేవలు అందించాలి
- మిలిటరీమెన్ శ్రీనివాసులు ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్



ఇంటర్నెట్, టెలీఫోన్ సేవలపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామాలకు నిరంతరాయంగా టెలీఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు అందేలా చర్యలు చేపడతామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జిల్లాలోని కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లె చెందిన మిలిటరీమెన్ శ్రీనివాసులు తన సొంత ఊరిలో టెలిఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం లేక కమ్యూనికేషన్ వ్యవస్థ సరిగా అందక విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉద్యోగస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా మంత్రి లోకేశ్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో టెలీఫోన్, ఇంటర్నెట్ ప్రొవైడర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వెయ్యిమందికి పైగా మొబైల్ సర్వీసులు ఉన్న ముదిరెడ్డి పల్లెలో వారంలోగా మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ సదుపాయం కల్పించాలన్నారు. ప్రొవైడర్లు ఆయా నెట్‌వర్క్ కంపెనీల పైస్థాయి అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన గ్రామంలో టెలీఫోన్, ఇంటర్నెట్ సదుపాయం కోసం టవర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మారుమూల గ్రామాలకు సైతం టెలీఫోన్ సిగ్నల్స్ అంతరాయం లేకుండా ఆప్రాంత ప్రజల సౌకర్యార్థం నెట్‌వర్క్ కంపెనీలతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. సమావశంలో కలెక్టరేట్ ఏవో విజయకుమార్, నెట్‌వర్క్ ప్రొవైడర్లు రామ్‌ప్రకాష్ షామీ (బీఎస్ఎన్ఎల్), వెంకటేష్ (ఎయిర్‌టెల్), మణికంద (జియో) ముదిరెడ్డిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్లకు ముగిసిన శిక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీకలెక్టర్లు

కురబలకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులు పర్యటించిన ట్రైనీ కలెక్టర్లకు శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. మండలంలోని కానసానిపల్లె సచివాలయ పరిధిలో వివిధ అంశాలపై పరిశీలించారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ప్రజలతో చర్చించారు. ఆఖరి రోజున తెట్టు పంచాయతీ పరిధిలోని ప్రముఖ విద్యాసంస్థ ఆర్‌సీ పాఠశాల, కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో పర్యటించి విద్యావిధానం, మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా ప్రమాణాలకు చేపట్టాల్సిన సలహాలు, సూచనలు ఇచ్చారు. మరిన్ని వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం విద్యావిధానంపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కురబలకోట ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, ఎంఈఓ ద్వారకనాధ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ జిల్లా స్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు అండర్-19 హాకీ జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి చంద్రమోహన్‌రాజు తెలిపారు. జిల్లాలోని హాకీ క్రీడాకారులు అదే రోజు ఉదయం 9గంటల లోపు స్పోర్ట్స్ స్కూల్ హాకీ మైదానం చేరుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9182001781, 9849817064 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విధుల నుంచి ప్రధానోపాధ్యాయుడి తొలగింపు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలోని కందిమల్లయ్యపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్‌హెచ్ఎం ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ముచ్చర్ల రాధాక్రిష్ణమూర్తిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ప్రధానోపాధ్యాయుడిపై ఆరోపణలు రావడంతో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో రుజువైనట్లు తేలడంతో విధుల నుంచి తొలగించినట్లు డీఈవో తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా షేక్ గౌసున్నీసాబేగం



మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గౌసున్నీసాబేగం

కమలాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యురాలిగా పరిధిలోని పెద్దచెప్పలి ఎంపీపీ ఉర్దూ స్కూలు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న షేక్ గౌసున్నీసా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందు కుంది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ, మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవం పురస్కరించుకుని ఆమెకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. షేక్ గౌసున్నీసాబేగం ఉపాధ్యాయ వృత్తిలో గత 24 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నారు. ఈమె విద్యలో చేస్తున్న సేవలను గుర్తించిన అధికారులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో సహాఉపాధ్యాయులు ఆమెకు అబినందనలు తెలిపారు.

నైపుణ్యం ఆధారిత విద్య అభివృద్ధి జరగాలి

- వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతతో పాటు నైపుణ్య ఆధారిత విద్యను అభివృద్ధి చేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ కోరారు. బుధవారం వైవీయూ తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో జరిగిన ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల తగ్గుదలపై సమీక్షించి, విద్యార్థుల అకడమిక్ పెర్మార్మెన్స్ అండ్ అసెస్‌మెంట్ రికార్డ్ ఐడీలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. జాతీయ విద్యావిధానం-2020 అమలు, రోడ్‌మ్యాప్‌పై చర్చిస్తూ విశ్వవిద్యాలయం అన్ని అనుబంధ కళాశాలలకు సహకారం అందిస్తుందని తెలిపారు. విద్యా ప్రమాణాలు, సంస్థాగత పనితీరు మెరుగుపరచడంలో కళాశాలలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాలల అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ రఘుబాబు, సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన కల్వర్టు ఏర్పాటు





అధ్వానంగా ఉన్న పంట పొలాలకు వెళ్లే రహదారి, పైపులు వేసి రోడ్డు తయారు చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంకకు ఉన్న పైపులు పగిలిపోయి రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈ దుస్థితి మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ విషయం రైతులు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి లక్ష రూపాయలు నిధులు మంజూరు చేశారు. దీంతో యుద్ధప్రాతిపదికన (రెండురోజుల్లోనే) కొత్త పైపులు వేసి పంట పొలాలకు దారి ఏర్పాటు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు







సూర్య, ఎస్‌కె సమీర్, మహ్మద్ నవాజ్

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-19 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. కడప నగర శివారు ప్రాంత కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో శివచరణ్ 151 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. రెండవ రోజు బుధవారం కడప జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 280 పరుగుల వద్దే డిక్లేర్ చేసింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 348 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో సూర్య 111 పరుగులు సాధించగా, ఎస్.కే. సమీర్ 119, ఎస్‌కె మహమ్మద్ నవాజ్ 58 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో చిత్తూరు-అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో కేవలం 146 పరుగులకే చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 40.1 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 80 పరుగులు చేసింది. రెండో రోజు బుధవారం ఓవర్‌నైట్ స్కోర్ 80 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు చేపట్టి 87.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మహ్మద్ అజహర్ 50 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టుకు 45 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

శ్రీకృష్ణ దేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సీఎం చంద్రబాబుకు హరిప్రసాద్ వినతి



కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలు జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పర్యటనలో భాగంగా కార్యక్రమం ముగించుకొని తిరుగు ప్రయాణంలో కడప ఎయిర్‌పోర్టుకు వచ్చిన చంద్రబాబును కోరారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ వచ్చే సంవత్సరం ఆయన జయంతి ఉత్సవాలను అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగానిర్వహించేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. చంద్రబాబు కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి ఎస్.గోవర్దన్‌రెడ్డి ఉన్నారు.

మెడికల్ విద్యార్థి శ్రీనిత్య ప్రతిభ



శ్రీనిత్యసురగౌరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జమున తదితరులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2024-25 సంబంధించి అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగం విద్యార్థి శ్రీనిత్యసురగౌరి మొదటి సంవత్సరం ఫలితాలలో 900 కి 749 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి యూనివర్సిటీ స్థాయిలో మొదటిస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో శ్రీనిత్యసురగౌరిని ప్రిన్సిపాల్ జమున, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కార్పొరేషన్ విఫలం'



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కార్పొరేషన్ పాలక వర్గం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ మండిపడ్డారు. బుధవారం కార్పొరేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో విషజ్వరాలు, దోమల సమస్యలు తీవ్ర స్థాయిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యునైటెడ్ నేతలు అవ్వారు మల్లికార్జున, అంజనేయులు, జేవీ రమణ,సంగటి మనోహర్, ఎస్‌ఏ సత్తార్, నగిలి గుర్రప్ప, ప్రతాప్‌రెడ్డినైపు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గెల వేయని చెట్లకు ముందస్తు చర్యలు చేపట్టండి



బ్రహ్మాస్త్రం తయారీని వివరిస్తున్న భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని గెలవేయని చెట్లకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని రాగిమానిపల్లె రైతు సేవా కేంద్రంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి బ్రహ్మాస్త్రం కషాయం ఎలా తయారుచేయాలన్న విధానాన్ని డెమో చేసి చూపించారు. పశుసంవర్ధకశాఖ అధికారి సుబ్బరాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఢిల్లీలో బాంబు పేలుడు కేంద్రం వైఫల్యమే'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుడు దాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆరోపించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ భారత దేశంలో ఎప్పుడు ఎలక్షన్ జరిగినా ఒక రోజు ముందే దేశంలో ఏదో ఒక ప్రాంతంలో బాంబుదాడులు జరగడం,అమాయక ప్రజలు మరణించడం బీజేపీ కుట్రే అని విమర్శించారు. బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లా నుంచి వేరు చేసే చర్యలను వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్, విజయకుమార్, మైనుద్దీన్, ముభారక్ బాష, దాసరి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

పులివెందుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పట్ల పూర్వ విద్యార్థులు తమ ఔదార్యం చాటారు. ఇటీవల 1994-95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో రూ.50వేల చెక్కును, 2003-2004 బ్యాచ్ విద్యార్థులు రూ.25వేల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న వైసీపీ నాయకులు

కమలాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పారావుపల్లె గ్రామంలోని పొలతల రవిశంకర్ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగతంగా కానీ పార్టీపరంగా కానీ ఏ సమస్యలు వచ్చినా మా దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎప్పుడైనా మీరందరూ మా వద్దకు రావచ్చని తెలిపారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మీరందరూ కష్టపడి పనిచేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించేందుకు ఇప్పటి నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందిన కార్యకర్తలకు టీడీపీ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర పరిశీలకుడు మనోహర్ నాయుడు, టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి చేతుల మీదుగా 66 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పార్టీలోని వివిధ ప్రజా సంఘాల కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండలాల కన్వీనర్లు భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, గంగిరెడ్డి, భాస్కరరెడ్డి, క్రిష్ణారెడ్డి, ఖాదర్‌బాషా, శివారెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలు కూల్చివేత

పులివెందుల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ప్లాన్ అనుమతి పొంది ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వెంటనే కూల్చివేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రాముడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ నియమాలు-2017ను సరళీకరించి, భవన యజమానులు సులభతరంగా ప్లాన్ అనుమతి పొందే అవకాశం కల్పించారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మించే భవన యజమానులు ప్రతి ఒక్కరు నిర్మాణాలకు అనుమతి పొందిన అనంతరం నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే అనుమతి లేని లేఔట్‌లో ప్లాట్లు కొని, భవన నిర్మాణ అనుమతులు, బ్యాంకు లోను రాక ఇబ్బందులు పడుతున్న యజమానులు అనధికార లే-అవుట్ల క్రమబద్ధీకరణ పథకం -2020 ద్వారా అటువంటి ప్లాట్లను లే అవుట్లను 23.01.2026లోపు దరఖాస్తు చేసుకొని క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా కృషిచేయాలి



ప్రమాణస్వీకారం చేయిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఏ ఎన్నికలు వచ్చినా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల, క్లస్టర్,యూనిట్, గ్రామ, బూత్‌కమిటీల నూతన కార్యవర్గ సభ్యులచే బీటెక్ రవి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన ఆయా కమిటీ అధ్యక్షులు,క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీసభ్యులు పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, టీడీపీనాయకులు విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి దివ్యాంగుల నమోదు

సింహాద్రిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో సదరన్ స్లాట్ బుకింగ్ 2025కు నవంబరు 14వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీఓ తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత సచివాలయంలో సంప్రదించి, దివ్యాంగ సర్టిఫికేట్ పొందవచ్చని ఎంపీడీఓ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

'ఆర్టీసీకి కూటమి పాలనలో మహర్దశ'

కడప మారుతీనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి కూటమి పాలనలో మహర్దశ వచ్చిందని ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. బుధవారం కడప ఆర్ఎం కార్యాలయ భవన సముదాయంలో గల ఆయన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే వైసీపీ పాలనలో గతి తప్పిన ఆర్టీసీని తిరిగి సరైన మార్గంలో నడిపించేలా చంద్రబాబు తగు రీతిగా స్పందించారన్నారు.

కంపు భరించాల్సిందేనా..?

ఈ పందులు పోయేదెప్పుడు ● తరలించకుంటే ప్రజలు రోగాల పాలే



చెన్నూరు- కొండపేట వంతెన వద్ద పందుల గుంపు

చెన్నూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని కొండపేట వెళ్లే దారిలో హైలెవెల్ వంతెన మీద పెన్నానదిలోకి దిగే చోట పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో పందులు విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యంగా ఉండడంతో పాటు ఇబ్బందులు పడుతున్నారు. పైగా అవి నివాసగృహాలకు సమీపంలోనే గుంపులుగా ఉండడంతో చీకటి పడ్డాక ఇళ్ల వద్దకు రావడం జరుగుతోంది. . కాగా ఈ విషయాన్ని సర్పంచ్ వెంకటసుబ్బయ్య దృష్టికి ప్రజలు తీసుకుపోవడంతో ఆయన సంబంధిత పందుల యజమానులకు నోటీసులు ఇచ్చామని స్థానిక పోలీసుస్టేషన్‌లో చెప్పడం జరిగిందన్నారు. అలాగే అతి త్వరగా వాటిని చెన్నూరులో లేకుండా దూరంగా తరలించేందుకు చూస్తున్నామని అన్నారు. ఏది ఏమైనా ఈ పందుల బెడద లేకుండా చేయాలని లేదంటే జనావాసాలకు దగ్గరగా ఉండడం వల్ల ప్రజలకు ఇబ్బందులతో పాటు రోగాలు తప్పవని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటాచెత్త సేకరణ వందశాతం జరగాలి



మున్సిపల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటింటాచెత్త సేకరణ వందశాతం జరగాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం 29వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. కైలాస్ ప్రెస్ నుంచి టీకేఎం స్ట్రీట్ వరకు, కమర్షియల్ ఏరియా మొత్తం పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, ప్రాంతంలోని వివిధ సమస్యలను అడిగి తెలుసు కున్నారు. శానిటేషన్ అధికారులకు పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఎయిర్‌పోర్టులో సీఎం చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బి.హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

శ్రీ చరణిని అభినందించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్



కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముగిసిన ప్రపంచ మహిళా క్రికెట్ పోటీలలో మన దేశం జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన కడప జిల్లా క్రీడాకారిణి లెఫ్ట్ ఆర్మ్‌స్పిన్నర్ శ్రీ చరణిని బుధవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ వైద్యనాథ్ ఆమె నివాసంలో కలిసి జ్ఞాపిక అందించి అభినందించారు. శ్రీ చరణి సాధించిన విజయం అపూర్వమన్నారు. అందుకు తాము గర్విస్తున్నామన్నారు. ముఖ్యంగా శ్రీచరణి క్రికెట్ క్రీడలో చూపిన అంకిత భావం మన రాష్ట్రానికి అపారకీర్తిని తెచ్చిపెట్టిందన్నారు.

సీమ రత్నాలు పాలా...సీవీ

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్య కవిగా పాలా వెంకటసుబ్బయ్య...అలాగే అవధానిగా సీవీ సుబ్బన్న చేసిన సాహితీ కృషి చాలా గొప్పదని, వారిరువురు కూడా రాయలసీమ రత్నాలని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ సంచాలకుడు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి కొనియాడారు. యోగి వేమన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం పాలా వెంకటసుబ్బయ్య 113వ జయంతి, సీవీ సుబ్బన్న 97వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ కేంద్రం జూనియర్ అసిస్టెంట్స్ ఆర్. వెంకటరమణ, ఎం. మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఈఓ కొట్టే వెంకటరమణ

పులివెందుల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని పురాతన శ్రీరంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ ఈఓ కొట్టే వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. బుధవారం శ్రీరంగనాథస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సీఈఓ రంగనాయకులు, డాక్టర్ ఆర్ఎస్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ సునీత తెలిపారు. అంతర్జాతీయ బాలిక వారోత్సవాల ముగింపు సమావేశం బుధవారం వేంపల్లె జడ్పీ బాలికల హైస్కూల్లో నిర్వహించారు. వేంపల్లె, వేముల,చక్రాయపేట మండలాల జిల్లా పరిషత్ హైస్కూళ్ల,కస్తూర్బాగురుకుల పాఠశాలలోని విద్యార్థినిలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు,హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులపై ప్రత్యేక దృష్టి సారించండి

లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న పార్థసారథిరెడ్డి



వేముల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందులపై ప్రత్యేక దృష్టిసారించాలని నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి కోరారు. బుధవారం విజయవాడలో పార్టీ కార్యాలయంలో నారాలోకేశ్‌ను పార్థసారథిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేయాలి

కడప సెవెన్ రోడ్స్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ నుంచి రిమ్స్‌కు వెళ్లేదారిలో శివానందపురం వద్ద స్పీడ్ బ్రేకర్, సూచికను ఏర్పాటుచేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ నాగేశ్వర్‌రెడ్డిని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ కోరారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఈఈని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

పంచాయతీ ఈవో వెంకటరాముడికి సన్మానం

సింహాద్రిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం పంచాయతీ ఈవో వెంకటరాముడును బుధవారం సచివాలయంలో శాలువ, పూలమాలతో పంచాయతీ సిబ్బంది సన్మానించారు. వెంకటరాముడు గ్రేడ్-1 సింహాద్రిపురం ఈవోగా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం వెంకటరాముడు పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీఓగా లింగాల మండలానికి బదిలీపై వెలుతున్న సందర్భంగా సిబ్బంది ఆయనను సన్మానించారు.

కడప బాలోత్సవం-3ను విజయవంతం చేయండి

పులివెందుల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నవంబరు నెల 29, 30వ తేదీలలో కడప పట్టణంలోని మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే కడపబాలోత్సవం-3ని జయప్రదం చేయాలని కమిటీ గౌరవాధ్యక్షుడు నాగమణిరెడ్డి, అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి రాజశేఖర్‌రాహుల్ కోరారు. బుధవారం పులివెందులలోని ఓ డ్రైవింగ్‌స్కూల్‌లో వారు మాట్లాడుతూ పులివెందుల ప్రాంతం నుంచి పాఠశాలల విద్యార్థులు పాల్గొనేటట్లు ఆయా స్కూల్ యాజమాన్యాలు చూడాలన్నారు. జిల్లా జేవీవీ అధ్యక్షుడు శివరాం, వేదిక్ మ్యాథమేటిక్స్ బాలశివ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా:ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా హామీలను నెరవేరుస్తూ పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీకి ఎంపికైన వడ్ల తేజ నర్సింహాచారిని ఎమ్మెల్యే అభినందించారు. తరువాత కమలాపురం నగర పంచాయతీ పరిధిలో పాత స్టేట్‌బ్యాంకు వద్ద నుంచి ప్రభుత్వ పాలిటె క్నిక్ కళాశాల వరకు రూ.కోటి 26 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే 8 స్వయం సహాయక సంఘాలకు కోటి 5లక్షల రూపాయల మెగా చెక్కును, 115 మంది చిరు వ్యాపారులకు పీఎం స్వావలంబన పథకం రూ.17 లక్షల 25వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనరు ప్రహ్లాద, మున్సిపల్ ఛైర్ పర్సన్ మార్పురి మేరీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్,బ్యాంకు మేనేజర్లు లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, టీవీ సుబ్బారెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ బాధిత కుటుంబాలకు సీపీఎం సానుభూతి

కడపసెవెన్ రోడ్స్‌నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు దాడిలో ప్రాణాలుపోయిన, క్షతగాత్రులైన వారి కుటుంబాలకు సీపీఎం నాయకులు తమ సానుభూతిని ప్రకటించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, చాంద్‌బాష మాట్లాడు తూ ఈ పేలుళ్లపై నిష్పాక్షికంగా, పారదర్శకంగా, నిర్దిష్టకాల పరిమితిలో జ్యుడీషియల్ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నిఘా, భద్రతా వైఫల్యాలకు బాధ్యులెవరో నిర్ధారించాలని కోరారు. సమాజాన్ని విభజించాలని చూస్తున్న విద్వేష రాజకీయలను నిరసించాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు.

నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమం

- మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది
- కూడు గూడు గుడ్డ ఎన్టీఆర్ ధ్యేయం : భూపేశ్‌రెడ్డి
- ఇళ్ల ప్రారంభం.. పట్టాల పంపిణీ


నూతన ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, సమన్వయంతో జమ్మలమడుగు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా కొనసాగుతోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి అన్నారు. మన ఇల్లు-మనగౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. 9వ వార్డులో జ్యోతి, షబానాల ఇళ్లను ప్రారంభించి వారితో ముచ్చటించారు. నిర్మించిన ఇళ్లను ఆయన పరిశీలించి మరుగుదొడ్లను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇంటి నిర్మాణానికి రూ.1.5లక్షలు మాత్రమే ఇచ్చేవారని, కానీ మోదీ, చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రస్తుతం రూ.2.5లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఉన్న 4,123 శాసనసభ నియోజకవర్గాలలో అభివృద్ధిలో జమ్మలమడుగు నాలుగో స్థానంలో ఉండాలన్న ధ్యేయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎర్రగుంట్ల అభివృద్ధి కోసం రూ.13కోట్లు సీఎంతో మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎర్రగుంట్లకు దక్షిణం వైపున బైపాస్ మంజూరు చేయించామని, భూసేకరణ జరుగుతోందన్నారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్లు వేయిస్తామన్నారు.

కూడు, గూడు, గుడ్డనే టీడీపీ నినాదం

కూడు, గూడు, గుడ్డనే టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ నినాదమని జమ్మలమడుగు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.70వేలు, రూ.50వేలు ఇళ్ల నిర్మాణానికి పెంచిందన్నారు. గత ప్రభుత్వం అన్నీ రాజకీయంగానే చూసిందన్నారు. రాజకీయాలు లేకుండా అందరికీ ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలందరూ అభివృద్ధి పరిపాలనను గమనించాలన్నారు. అనంతరం ఇళ్లు మంజూరు అయిన 153మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, మున్సిపాలిటి చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజు, కమిషనర్ శేషఫణి, హౌసింగ్ పీడీ రాజారత్నం, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మైదుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు), వనిపెంటలో ఖాళీగా ఉన్న మహిళా తాత్కాలిక గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. టీజీటీ(తెలుగు,హిందీ,ఇంగ్లీష్), బయోలాజికల్ సైన్స్ పోస్టులకు తప్పనిసరిగా పీజీ, బీఈడీ, టెట్‌లలో అర్హత ఉన్న మైదుకూరు మండలం, చుట్టుపక్కల ప్రాంతాల మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోపు వనిపెంట గురుకుల పాఠశాలలో అందించాలన్నారు. వివరాలకు 9398207776నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కొండాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక లైబ్రరీలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ముఖ్య అంశాలపై ప్రసంగాలు, 17న ప్రముఖులతో సెమినార్లు, 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 19న ప్రత్యేక మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

చాపాడులో..

చాపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చాపాడులోని ప్రభుత్వ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు కూడా అందిస్తున్నామన్నారు.

నేటి నుంచి క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ

చాపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 13వ తేదీ నుంచి రెండు రోజుల పాటు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరకిశోర్ తెలిపారు. 13న సర్పంచులకు, ఉపసర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, 14న డ్వాక్రా మహిళలకు, వీవోఏలకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. సభ్యులందరూ సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

మూడు రోజుల శిక్షణ

ఖాజీపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సర్పంచులకు, అధికారులకు మూడు రోజులపాటు స్వచ్ఛభారత్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దివిజాసంపతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ శిక్షణ తరగతులకు ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. పంచాయతీ అభివృద్ధిపై, అలాగే క్లీన్ అండ్ గ్రీన్‌పై కూడా శిక్షణ ఉంటుందన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శులని ఎంఈవో సావిత్రమ్మ అన్నారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శాంతినికేతన్ హైస్కూలులో మన ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, రోటరీక్లబ్ అధ్యక్షుడు గజ్జెల వెంకటేశ్వర్లు, మన సేవా సమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

జమ్మలమడుగు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామం ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం జమ్మలమడుగు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ చౌడప్పకు వినతిపత్రం అందజేశారు. ఎస్.ఉప్పలపాడు పేరుకే ఆదర్శగ్రామమని, ఎస్సీ కాలనీలో సమస్యలు తిష్ఠవేశాయని, వీధిలైట్లు, చెత్తాచెదారం, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడాలి


మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాస

ముద్దనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడాలని ముద్దనూరు పశువైద్యశాల ఇన్‌చార్జి ఏడీ వాసాశ్రీనివాస అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వ్యవసాయ అనుబంధ ఉత్పత్తిదారుల ద్వితీయ వార్షిక మహాసభ నిర్వహించారు. ఏపీఎం అపర్ణాదేవి మాట్లాడుతూ ఇప్పటి వరకు 45 రైతు సంఘాలు ఉన్నాయని, 100 సంఘాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మహిళలు రైతు సంఘాలుగా ఏర్పడటం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, అధ్యక్షురాలు శివపార్వతి, సీసీలు పాల్గొన్నారు.

ఢిల్లీ ఉగ్రదాడి మృతులకు నివాళి

జమ్మలమడుగు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఉగ్రదాడి మృతులకు బుధవారం జమ్మలమడుగు పాత బస్టాండులో ఉన్న గాంధీ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తదితరులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనాల శివనారాయణ, డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు యల్లయ్య, బాషు, సలీం, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

బద్వేలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నగరంలో ఎర్రకోట పక్కనే జరిగిన బాంబు పేలుడులో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ ఘటనకు కారణమైన ఉగ్రవాదులను శిక్షించాలని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, జకరయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆ ప్రకటనలో కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

జమ్మలమడుగు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడుకు నిరసనగా బుధవారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఢిల్లీ పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు.

ఎర్రమచ్చ తెగుళ్లను నివారించాలి

చాపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు వరి పైరుకు సోకిన ఎర్రమచ్చ తెగుళ్ల నివారించాలని మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి అన్నారు. బుధవారం నెర్రవాడ, భద్రిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులు సాగు చేసిన వరి పైరును పరిశీలించి ఎర్రమచ్చ నివారణకు ప్రోపికొనజోల్ మందును ఎకరాకు 200 మి.మీ. చొప్పున స్ప్రే చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సుప్రియ, సీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

పోరుమామిళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మనపల్లె గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఏపీ పశు సంవర్ధకశాఖ, ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 37 పశువులకు చికిత్స, 32 దూడలకు ఏలిక పాముల మందు తాగించారు. అలాగే దూడలకు మినరల్ బ్లాక్స్, పశువులలకు ఎముకల పొడిని అందించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, పశువైద్యాధికారి డాక్టర్ భరద్వాజ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


దూడలకు మందులు తాగిస్తున్న పశు వైద్యాధికారులు

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

జమ్మలమడుగు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదివి డాక్టర్లు కావాలని చేపట్టిన మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. అందుకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతమైందన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన విఫలమైందని, ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17నెలల్లోనే రూ.2.47లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, వల్లంబావిగారి రుషికేశవరెడ్డి, గజ్జెల లక్షుమయ్య, లొగిడి జయన్న, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కొమెర్ల జగదీశ్వరరెడ్డి, దేవగుడి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణం


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న వైసీపీ నేతలు

మైదుకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దారుణమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్థానిక అంకాలమ్మ ఆలయం నుండి రాయల కూడలి మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సరైన వైద్యం అందించడానికి అధునాతన పద్ధతులలో నిర్మించిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు తన తొత్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను తనే నిర్మించినట్లు చెప్పుకుని నేడు ముఖ్యమంత్రి సామూహిక గృహ ప్రవేశాలకు వెళ్లడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చాపల షరీఫ్, మూలే భరత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మెంబర్ బండి నాగేంద్రప్రసాద్, తువ్వపల్లి రఘు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


బాలికల సంరక్షణతోనే సమాజ భవిష్యత్తు


మాట్లాడుతున్న సీడీపీవో అరుణకుమారి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణతోనే సమాజ భవిష్యత్తు మెరుగుపడుతుందని ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ సీడీపీవో అరుణకుమారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కామనూరు ఆరోగ్య కేంద్రంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా మాట్లాడుతూ ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, భ్రూణహత్యలు నేరమన్నారు. పీవో సునీత బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలు, పిల్లలు ఎదుర్కొనే సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, నాగరత్నమ్మ, రఫియాభాను, సర్పంచ్ షేక్ షమీన్, కార్యదర్శి సుభాషిణి, మెడికల్ సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, పాఠశాల అధ్యాపకుడు యల్లారెడ్డి, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నందున ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి చిన్న ఓబన్న కోరారు. బుధవారం పీఎన్ఆర్ ఫంక్షన్ హాలులో ఈనెల 30న కడప పాత రిమ్స్‌లో నిర్వహించే రాయలసీమ, నెల్లూరు జిల్లాల సంఘం ప్రాంతీయ సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో జరిగే ప్రాంతీయ సదస్సులో భవన నిర్మాణ రంగం కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికుల ప్రాంతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జోరుగా శనగ పంట సాగు

మైలవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లుట్ల, బెస్తవేముల, వద్దిరాల, చిన్నకొమెర్ల, తలమంచిపట్నం, కర్మలవారిపల్లె, తదితర గ్రామ పంచాయతీల్లో జోరుగా ట్రాక్టర్లతో శనగ పంట విత్తనం సాగు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో రైతులు పంటను సాగు చేస్తున్నారు. మండలంలో దాదాపు నాలుగు వేల హెక్టార్లకుపైగా శనగ పంట సాగవుతోంది. ఇటీవల వర్షాలు బాగా కురవడంతో అక్టోబరు నెలలో సాగు చేయాల్సిన పంట నవంబరులో సాగు చేస్తున్నారు. పొలాలు బాగా పదునెక్కడంతో పంట దిగుబడి బాగా వస్తుందనే ఆశతో సాగు చేస్తున్నారు.

ఘనంగా కాలభైరవస్వామి జయంతి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొర్రపాడు రోడ్డులోని తాత్కాలిక కూరగాయల మార్కెట్ వద్ద బుధవారం కాలభైరవస్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాలభైరవస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జునస్వామి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ పోస్టులు భర్తీ చేయాలి

బద్వేలు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల గ్రంథాలయ పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని కోరారు. బుధవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేసి ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తీసుకురావలన్నారు. గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్, షరీఫ్, ఆదిల్, ఓబుల్‌రెడ్డి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

బద్వేలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తి మండలంలో దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య అని, మాదిగలకు చెందిన పొలంలో గొర్రెలను మేపుతున్న అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తులను ప్రశ్నించినందుకు మాదిగలపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బండి జకరయ్య, కేశవ, పిచ్చయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు ధనుర్వాతంతో చనిపోతున్నాయి

- కడప వ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు

బి.కోడూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లావాగుపల్లెలో పదిరోజులుగా గొర్రెలు వింత వ్యాధితో చనిపోతున్న నేపథ్యంలో జిల్లా పశువైద్యాధికారులు మంగళవారం చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి వ్యాధి లక్షణాలు కనుగొనేందుకు కడప ల్యాబ్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై బుధవారం జిల్లా వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు మాధవి, సంధ్యారాణి స్పందిస్తూ గొర్రెలకు ధనుర్వాతం వ్యాధి సోకిందని, అందువల్లనే పశువులు చనిపోతున్నాయన్నారు. ధనుర్వాతం వ్యాధికి మందులు తెప్పిస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా కమిటీల్లోకి మండల ఉపాధ్యాయులు


చంద్రశేఖర్


బాలరాజు


నారాయణరెడ్డి


రవీంద్రబాబు

కాశినాయన నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం నుండి ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా కమిటీల్లోకి నలుగురు ఉపాధ్యాయులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎస్టీయూ రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం, ఎస్టీయూ మండల అధ్యక్షుడు వీవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి టి.ప్రదీప్ తెలిపారు. ఇటీవల వేంపల్లెలో నిర్వహించిన కడప జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్‌గా వాకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా బి.బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.రవీంద్రబాబు, డీవీ నారాయణరెడ్డిని ఎంపిక చేశారన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

మైదుకూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రబీ సీజన్ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి రైతు తమ పంట వివరాలను వ్యవసాయశాఖ అధికారుల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వినియోగం, ప్రభుత్వ పథకాలు, పంటలను సాగుచేసే పద్ధతి, సస్యరక్షణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అధికారి సిద్దారెడ్డి, సిరికల్చర్ అధికారి గురప్ప, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోసం మంత్రులను కలిసిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవిలను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మెట్టుపల్లి రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి వున్నారు.

జాతీయ రహదారి విస్తరణ పరిహారం చెల్లింపులో అన్యాయం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి-వేంపల్లె జాతీయ రహదారి ఎన్‌హెచ్440 విస్తరణలో భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులో అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని జిలానీ బాష, నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ పరిధిలో రహదారి విస్తరణలో విలువైన భూములు, ఇండ్లస్థలాలు, ఖాళీ స్థలాలు కోల్పోతున్నా అధికారులు బాధితుల సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్యాలయం ప్రకటన మేరకు ఈ ప్రాంతంలో సెంటుకు రూ.2.65 లక్షలు నష్టపరిహారం నిర్ణయించారని, నిజానికి అంతకన్నా ఎక్కువ ధర ఉందన్నారు. తమ అభ్యంతరాలను జేసీ, ఆర్డీవోల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డిమార్ట్ భూముల అమ్మకాల ఆధారంగా నష్టపరిహారం చెల్లింపుపై పునఃసమీక్షించాలని కోరారు. ఈ సమావేశంలో నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

పోరుమామిళ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పోరుమామిళ్లలోని స్త్రీశక్తిభవనంలో ఆయన పాల్గొని ప్రజలు, రైతుల సమస్యలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.